www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 11 జనవరి 2024
5
వైఎస్ఆర్



జిల్లాలో పలువురు ఎస్ఐలు బదిలీ

కడప అర్బన్ : జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నచౌక్ ఎస్ఐ తులసినాగప్రసాద్ రాజుపాలెం బదిలీ చేశారు. రాజుపాలెం ఎస్ఐ రాజగోపాల్ కడప వీఆర్కు, గోపవరం ఎస్ఐ చంద్రశేఖర్ తాళ్ల ప్రొద్దుటూరుకు, తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ మోహన్ కడప వీఆర్కు, తొండూరు ఎస్ఐ హనుమంతు తాలూకాకు, ఇక్కడ ఉన్న ఎస్ఐ గోపీనాథ్రెడ్డి కడప వీఆర్కు, కడప 2 టౌన్ ఎస్ఐ జయరాములు బి.కోడూరు ఎస్ఐగా బదిలీ చేశారు. ఇక్కడ ఉన్న ఎస్ఐ వెంకటరమణ కడప వీఆర్కు అటాచ్ చేశారు. వీఆర్లో ఉన్న ఆర్.వి.కొండారెడ్డి చాపాడు ఎస్ఐగా బదిలీ చేశారు. చాపాడు ఎస్ఐ మొయినుద్దీన్ ముద్దనూరుకు, ముద్దనూరు ఎస్ఐ చంద్రమోహన్ కడప తాలూకా ఎస్ఐగా బదిలీ చేశారు. కడప తాలూకా ఎస్ఐ రామకృష్ణ ప్రొద్దుటూరు 2 టౌన్ ఎస్ఐగా బదిలీ చేశారు. ఇక్కడ ఉన్న ఎస్ఐ సురేష్ను మైలవరం ఎస్ఐ బి.వి.కృష్ణయ్య కడప 1 టౌన్ ఎస్ఐగా బదిలీ చేశారు. పులివెందుల ట్రాఫిక్ ఎస్ఐ హాజీ వలి కడప తాలూకా ఎస్ఐగా బదిలీ చేశారు.

మెడకు ఉరితాళ్లతో నిరసన

- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- 30వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి-కడప అర్బన్

అంగన్వాడీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని 30 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే వారి సమస్యను పరిష్కరించాల్సింది పోయి, అధికార బలంతో అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ఉపయోగిస్తారా అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన, చట్టబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి పోరాడుతున్న అంగన్వాడీలపై జిఒ నంబర్ 2 ఎస్మా ప్రయోగించిన తీరుచూస్తుంటే ఉద్యమానికి ప్రభుత్వం ఎంతగా భయపడుతుందో అర్థమవుతుందన్నారు. గతంలో ఉద్యోగుల, కార్మికుల పోరాటాలపై ఎస్మాను ప్రయోగించిన ముఖ్యమంత్రులందరూ అధికారాన్ని కోల్పోయారని, జగన్ కూడా ఆ జాబితాలో చేరేందుకు సిద్ధపడాలని హెచ్చరించారు. ఏ ఒక్క అంగన్వాడీ కూడా ప్రభుత్వ బెదిరింపులకు భయపడదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు, అంగన్వాడి యూనియన్ నాయకులు అంజనీ దేవి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెను అణచివేసేందుకు నోటీసులు ఇచ్చి సమ్మెను ఆపాలని ప్రయత్నం చేస్తుందని, తాము నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని, తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మెను ఆపేది లేదని ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడీ యూనియన్ నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి పేర్కొన్నారు. జమ్మలమడుగు పట్టణంలో అంగన్వాడీలు ఉరి వేసుకుని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జమ్మలమడుగు సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎసుదాసు, డివైఎఫ్ఐ బాధ్యులు వినయ్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, కులాయమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్):** తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మె 30 రోజుల సందర్భంగా 30 ఆకారంగా కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 30 రోజుల నుంచి అంగన్వాడీలు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా చట్టం తీసుకురావడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీల మద్దతుగా మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి శిబిరం వద్దకు వచ్చి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఇంత మంది మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేస్తుంటే నెలరోజుల నుంచి వారి సమస్యలు పరిష్కరించకపోవడం ఓపిక లేదా అని విమర్శించారు. ఆందోళనలో అంగన్వాడీ యూనియన్ లీడర్ రాజీ, అధ్యక్షులు రాణి, నిర్మల, లక్ష్మీదేవి, శివమ్మ, అర్బన్ సెంటర్ లీడర్లు పాల్గొన్నారు. **వేంపల్లె:** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేసి రోడ్డుపైనే కూర్చుని భోజనాలు చేశారు. అంగన్వాడీలు గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. జీతాలు పెంచే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వేంపల్లె, వేముల, చక్రాయపేట మండలాలలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జమ్మలమడుగు : మెడకు ఉరి వేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



కడప : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్



వేంపల్లె : రోడ్డుపై భోజనాలు చేస్తున్న అంగన్వాడీలు

పేదల ఇళ్లు కూల్చివేతకు యత్నం

- అడ్డుకున్న జి.బి.నగర్ కాలనీ వాసులు
- బాధితులకు సిపిఎం నాయకుల సంఘీభావం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

మండలంలోని జి.బి.నగర్ కాలనీలో సుమారు 20 సంవత్సరాలుగా జీవనం కొనసాగిస్తున్న పేదల ఇండ్లను రెవెన్యూ అధికారులు బుధవారం జెసిబితో అక్రమంగా కూల్చివేసేందుకు ప్రయత్నించగా కాలనీ వాసులు, సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. మహిళలు, వృద్ధులు ఇళ్లు కూల్చవద్దని, తమను నిరాశ్రయులను చేయవద్దంటూ రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్నారు. తహశీల్దార్ గంగయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ పేర్కొన్నారు. గతంలో రూ.50 లక్షల పేదలకు నష్టం కలిగించారన్నారు. 20 ఏళ్లుగా జీవనం కొనసాగిస్తున్నామని తహశీల్దార్కు పేదలు మొరపెట్టుకున్నా వినిపించుకోకుండా వీఆర్ఎలు అందరిని పంపించి జెసిబి వాళ్లే స్వయంగా వీఆర్ఎలు తెచ్చి పేదల ఇండ్లను కూల్చేయడానికి ప్రయత్నించారన్నారు. జెసిబి ఎందుకు తెచ్చారని ప్రశ్నించగా వీఆర్ఎలకు ఈ స్థలం కావాలి తహశీల్దార్ జెసిబితో చదును చేసుకోమన్నారని, తమకు ఇంటి పట్టాలు ఇస్తారని కాలనీ వాసులతో గొడవ పడ్డారన్నారు. ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకుని వచ్చేదానికి పూనుకున్నారన్నారు. 100 ఎకరాలు బినామీ పేర్లతో ఉన్న డికెటి భూములను రంగసముద్రం పంచాయతీలో దోచుకుంటుంటే వాటిని వదిలేసి పేదలేసుకొని జీవనం చేసుకుంటూ ఉన్నటువంటి కాలనీలో దుర్మార్గంగా తహశీల్దార్ వ్యవహరిస్తున్నారన్నారు. తహశీల్దార్ గతంలో నందలూరులో పనిచేసేటప్పుడు 30 ఎకరాలు భూమి ఆన్లైన్లో ఎక్కించుకొని రిజిస్టర్ చేపించుకొని బినామీ పేర్లతో అమ్ముకున్నాడని విమర్శించారు. స్థలాల రూపంలో ఆక్రమణ ముందు ఉంటారన్నారు. ఇప్పటికే ఆన్లైన్ రూపంలో పెద్ద ఎత్తున చేతులు తడిపాడని మండల ప్రజలు వాపోతున్నారని పేర్కొన్నారు. తహశీల్దార్ ఇప్పటికైనా ఆలోచించి పేదల పక్ష నిలబడి వాళ్లకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. సిపిఎం కాలనీ పక్కనే 30 ఎకరాలు భూమి ఉంది. ఆ స్థలంలో పట్టాలు మంజూరు చేసుకోవచ్చన్నారు. అలాంటి స్థలాన్ని వదిలిపెట్టి సిపిఎం కాలనీలోనే పేదల ఇల్లు కూల్చి పట్టాల మంజూరు చేయవలసిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. లేని పక్షంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ఆమరణ నిరాదీక్ష కూర్చుంటామని హెచ్చరించారు.



ఇళ్ల కూల్చివేతను అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు, పేదలు

నోటిఫికేషన్ అడిగితే అరెస్టులు చేస్తారా?: డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

నిరుద్యోగులు ఏళ్ల తరబడి డిఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తుంటే నోటిఫికేషన్ విడుదల చేయాలని అడిగితే ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడటాన్ని యువజన సంఘంగా తీవ్రంగా ఖండిస్తున్నామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. ప్రభుత్వం అక్రమ అరెస్టులను నిరసిస్తూ బుధవారం పూలే సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డిఎస్సీ విడుదల చేయకుండా ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదన్నారు. సంవత్సరాల కొలది కోచింగ్ సెంటర్లలో రూ.వేలు ఖర్చు చేసుకుంటూ వయో భారంతో మనో వేదనకు గురవుతున్నారన్నారు. డిఎస్సీ వస్తుందో రాదో అని బిఇడి, టిటిసి చదివిన నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. డివైఎఫ్ఐగా డిఎస్సీ విడుదల చేయాలని చలో విజయవాడ పిలుపునిస్తే కనీసం నాయకులను కలవనీయకుండా నోటిఫికేషన్ విడుదల చేస్తా మని చెప్పకుండా ఎమర్జెన్సీని తలపించే విధంగా డివైఎఫ్ఐ నాయకులను రెండు రోజులు ముందే ఎక్కడికక్కడ అరెస్టులు, నోటీసులు, గృహ నిర్బంధాలు చేసి విజ యవాడలో అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. జగన్మోహన్రెడ్డి గుర్తు పెట్టుకోవాలి అధికారం శాశ్వతం కాదని తెలిపారు. ఇలా నియంతలా వ్యవహరించిన తెలంగాణలో యువత ప్రభుత్వాన్నే మార్చేశారన్నారు. రాష్ట్రంలో 25 వేల పోస్టులతో మెగా డిఎస్సీను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు, నాయకులు సునీల్, సురేష్, సంజీవ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

చంద్రబాబు సభలకు విశేష స్పందన :'మన్నూరు'

ప్రజాశక్తి-కడప అర్బన్

రా కదలిరా చంద్రబాబు సభలకు యువత, మహిళలు స్వచ్ఛందంగా వస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ అన్నారు. బుధవారం పాత బస్టాండ్లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుం టున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు ప్రసంగంలో వైసిపి చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తుంటే వైసిపి ఎమ్మెల్యేలు జవాబు చెప్పలేక వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారని ఇది మంచిది కాదని ఖండించారు. సమావేశంలో టిడిపి మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి గగ్గుటూర్ నజీర్, నాయకులు రూపనగుడి హుస్సేన్, బాబయ్య, అజంతుల్లా పాల్గొన్నారు.



తలపడుతున్న ఆంధ్ర, గోవా జట్లు

గోవాపై ఆంధ్ర జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

ఎసిఎ స్టేడియంలో నాలుగు రోజులపాటు జరిగిన సి కె నాయుడు క్రికెట్ ట్రోఫీ మ్యాచ్లో ఆంధ్ర జట్టు గోవా జట్టుపై 53 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఒక వికెట్ నష్టానికి 61 పరుగులు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గోవా జట్టు 98.2 ఓవర్లలో 327 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. ఆ చెట్టులోని అభినవ్ తేజ్ రానా 158(241) పరుగులు చేశాడు. ఆంధ్ర జట్టుకు చెందిన వై.వాసు అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 32.2 ఓవర్లు బౌలింగ్ చేసి అందులో 13 ఓవర్లు మేడిన్ వేసి 97 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ టి.విజయ్ 2 వికెట్లు తీసుకున్నాడు. ఈ మ్యాచ్లో మొదటి ఇన్నింగ్స్ఃలో ఆంధ్ర జట్టు 606 పరుగులు వద్ద డిక్లేర్ చేసింది. గోవా జట్టు మొదటి ఇన్నింగ్స్లో 226 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్లో 327 పరుగులు చేసింది. ఆంధ్ర జట్టు గోవా ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించింది.



6 వికెట్లు తీసిన వాసు



158 పరుగులు చేసిన అభినవ్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప : ప్రతి ఒక్కరూ చట్టాలబ్బాయి అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ అన్నారు. నేక్నామ్ కళాక్షేత్రంలో దాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసిన నాబార్డ్ గ్రామీణ మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 2019, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్, నల్సా పథకాల గురించి వివరించినారు. కార్యక్రమంలో దాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఓబుల్ దాస్, గిరిజన కో-ఆపరేటివ్ మార్కెటింగ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రమణారెడ్డి, పారా లీగల్ వాలంటీర్ జె.సురేష్, సహాయం పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన



జమ్మలమడుగు : భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలో భాగంగా 16వ రోజు వినూత్న రీతిలో తమ నిరసన తెలియజేశారు. బుధవారం కార్పొరేషన్ గేట్ దగ్గర శుభ్రపరిచి ముగ్గులు వేసి, గొబ్బెమ్మ ఏర్పాటు చేసుకుని అందంగా అలంకరించారు. చెక్కభజన కార్యక్రమం చేస్తూ మారాలి జగన్ మాకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి జగన్ అంటూ.. ఈ సంక్రాంతి కన్నా జగన్ మారి మాకు ఇచ్చిన హామీని నెరవేర్చడంటూ తమ నిరసన తెలియజేశారు. కార్మికులంతా కలసి చెక్క భజన చేస్తూ, మారాలి జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి జగన్ అంటూ నినాదాలతో హెూరెత్తించారు. భిక్షాటన చేస్తూ మారాలి జగన్ అంటూ నగరం లో దుకాణాల వద్ద భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సుంకర రవి మాట్లాడుతూ మంత్రి అది మూలపు సురేష్ చర్చలకు సంబంధించి 70 శాతం కార్మికుల డిమాండ్లను నెరవేర్చామని చెప్పడం అవాస్తవమన్నారు. గతంలో కార్మికులకు రూ.15 వేలు జీతం గాను రూ.6000 విడిగా విడిగా ఇచ్చేవారని చెప్పారు. 16 రోజుల సమ్మె చేస్తుంటే ఆ రెండిటిని ఒకటిగా చేసి జీతం రూ.21 వేలు ఇచ్చాం, 70 శాతం డిమాండ్లను నెరవేర్చమని ప్రజలకు, మీడియాకు తప్పుడు సమాచారం ఇవ్వడం మీ స్థాయికి తగదని తెలిపారు. మీకు కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే జగనన్న అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని, దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వారు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనము ఇచ్చి కార్మికులు 100 శాతం డిమాండ్ల నెరవేర్చమని ప్రకటన చేయడాన్నిసిఐటియుగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంచుపాటి తిరుపాల్, వడ్లపల్లి శ్రీధర్ బాబు, కంచుపాటి శ్రీరాములు, సుంకర కిరణ్ ఆదాం ఆనంద్ నాగరాజు, ఇత్తడి ప్రకాష్, కొండయ్య,కుమార్ శివ, దస్తగిరిమ్మ, ధరణి, కొండమ్మ,లక్ష్మి, ఆరోగ్యమ్మ, కార్మికులు, పెద్ద ఎత్తున మహిళ పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, డివైఎఫ్ఐ బాధ్యుడు ఎ.వినయ్ కుమార్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. **మైదుకూరు:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం జగన్మోహన్రెడ్డి కార్మికులకు ఆప్కాస్ కాకుండా రెగ్యులర్ చేయాలని మున్సిపల్ కార్మికులు సాష్టాంగ నమస్కారంతో నిరసనలు తెలిపారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో కార్మికులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** మున్సిపల్ కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తమ రెండు చేతులు జోడించి వేడుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు విజయకుమార్, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సాల్మన్, చంటి, కోశాధికారి రాఘవ, సహాయ కార్యదర్శి మోహన్. ఉపాధ్యక్షులు గుర్రమ్మ, రమాదేవి ప్రమీలమ్మ, పాల్గొన్నారు.



కడప : మూకట్లతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

బిఎస్ఎన్ఎల్ సేవలపై ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజలు బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎజిఎం శ్రీనివాసరావు కోరారు. బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఎన్టిఆర్ సర్కిల్, 7 రోడ్లు, పాత కలెక్టరేట్ మీదుగా బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో 4జి సేవలు ప్రారంభమ వుతాయని చెప్పారు. తక్కువ ధరతో అందిస్తున్న బ్రాడ్ బ్యాండ్ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భారత ప్రభుత్వ సంస్థగా ఉన్న బిఎస్ఎన్ఎల్ హైసెక్యూరిటీగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎజిఎం లక్ష్మణ్ నాయక్, బిఎస్ఎన్ఎల్ ఇయు జిల్లా కార్యదర్శి ఆకుల సుబ్బారెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కళ్యా సుధాకర్, సహాయ కార్యదర్శి రెడ్డెప్ప పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆర్తి ఉమన్స్ సెంటెర్లో మహిళల జీవనోపాదిని పెంపోదించుటకు కుట్టు శిక్షణ, మిషన్ హాండ్ ఎంబ్రాఇడరీ, బ్యుటీషియన్ శిక్షణలతోపాటు కంప్యూటర్ శిక్షణ, ఆంగ్లంలో భావ ప్రకటనా సామర్థ్యం పెంచుకునే విధంగా ఇంగ్లీష్ అకాడమీని మహిళ సమాజ్ భవనంలో త్వరలో ప్రారంభించనున్నట్లు ఆర్తి సంస్థల చైర్మన్ పి.వి.సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాసాన్ని మహిళలు ఉపయొగించుకొవాలని వివరాలకు సంస్థ కార్యదర్శి బి.దుర్గాకుమారిని సంప్రదించ వచ్చన్నారు.

సంక్రాతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించామని తెలిపారు. న్యాయ నిర్ణయతరుగా భద్రావతి, డాక్టర్ మాధవి, స్పెషలిస్ట్ భాగ్యమ్మ వ్యవహరించాలని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రథమ బహుమతిగా రూ.పది వేలు జి.శ్వేత, ద్వితీయ బహుమతి రూ.ఎనిమిది వేలు సుప్రజ, తృతీయ బహుమతి రూ.ఆరు వేలు వైష్ణవికి అందించినట్లు తెలిపారు. ఐదు స్పెషల్ ప్రైజ్లు ఒక్కరికి రూ.1116 అందించినట్లు పేర్కొన్నారు.

వేతన సవరణలో జాప్యం అన్యాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎల్ఐసి యాజ మాన్యం ఇక జాప్యం లేకుండా తక్షణం వేతన సవరణ చర్చల తేదీ ప్రకటించాలని ఎల్ఐసి సిబ్బంది సంఘాల జాయింట్ ఫ్రంట్ నాయకులు జె.చంద్రపాల్, ఎ.రఘునాథ్రెడ్డి, సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం సమ్మె నిరసన ప్రదర్శనను వుద్దేశించి వారు మాట్లాడారు. డిసెంబర్లో జరగాల్సిన చర్చలని అర్థాంతరంగా యాజమాన్యం వాయిదా వేసిందన్నారు. ఎల్ఐసి లో వేతన సవరణ గడువు ముగిసి ఒకటిన్నర సంవత్సరమైందని, ఇంకా చర్చలే ప్రారంభం కాకపోవడం అన్యాయమన్నారు. 2022 డిసెంబర్ తో పోలిస్తే 2023 డిసెంబర్లో 94 శాతం అధికంగా ప్రీమియం ఎల్ఐసి సేకరించిందన్నారు. రెండు దశాబ్దాలుగా జీవిత బీమా రంగంలో ప్రైవేటు కంపెనీల గట్టి పోటీని ఎదుర్కొని ఎల్ఐసి ని ప్రపంచ స్థాయి సంస్థగా నిలబెట్టిన ఘనత సిబ్బందిదేనన్నారు. నూతన పెన్షన్ స్కీం వర్తించే సిబ్బందికి 14శాతం యాజమాన్య పిఎఫ్ వాటా చెల్లించాలన్నారు. ఎల్ఐసిలో నూతన నియామకాలు చేపట్టాలన్నారు. సిబ్బంది అంశాలలో ఇటీవల యాజమాన్యం ప్రదర్శిస్తున్న ఏకపక్ష వైఖరిని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ల నాయకులు సుధీకర్, ఎల్లారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, అక్బర్ బాషా, అమీనా పర్వీన్, సరళ, పద్మజ, వారిజాతమ్మ, అయ్యవారు రెడ్డి, నజీరుల్లా, కుమార్, వసుప్రద, అప్పయ్య పాల్గొన్నారు.



దుస్తులు ఇస్త్రీ చేస్తున్న మాధవి

'భావితరాల మార్గదర్శకుడు చంద్రబాబు'

ప్రజాశక్తి-కడప అర్బన్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బావి తరాల మార్గ దర్శకుడని కడప నియోజకవర్గ ఇన్ఛార్జి మాధవి పేర్కొన్నారు. 5వ డివిజన్ అశోక్ నగర్ ప్రధాన రోడ్డులో బుధవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని టిడిపి, జనసేన నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో టిడిపి విజయం తధ్యమన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలులోకి తెస్తామన్నారు. చంద్రబాబు సిఎం కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. జనసేన ఉమ్మడి జిల్లా సమన్వయకర్త సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ ఉచిత పథకాల పేరుతో ఈ ప్రభుత్వం ఒక చేత్తో ఇస్తూ, మరో చేతితో ఇచ్చిన దానికి రెండింతలు ప్రజల నుంచి రాబట్టుకుంటుందని అన్నారు. నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి మాట్లాడుతూ రోడ్లు అధ్వానంగా మారిన ఈ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాల పంపిణీలో డ్రై క్లీనర్స్ దుకాణంలో దుస్తులను మాధవి ఇస్త్రీ చేసి, రజకులకు, కుమ్మరులకు, చేతి వృత్తి దారులకు తెలుగుదేశం పనిముట్లు అందించేదని గుర్తు చేశారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని శిల్పారామంలో ఈనెల 13 నుంచి 16 వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎఒ శివప్రసాద్రెడ్డి తెలిపారు. బుధవారం కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న రాష్ట్ర అతిథిగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13న రంగవల్లి ముగ్గుల పోటీలు, 14న గాలిపటాల పోటీలు, 16న సాంప్రదాయ వస్త్రాధారణ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి రూ.5,116, రూ.3,116, రూ.2,116 నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. సాంప్రదాయ దుస్తుల పోటీల్లో గెలుపొందిన వారికి రూ.3,116, రూ.2,116, రూ.1,116 బహుమతులు ఇస్తామని తెలిపారు. గాలిపటాల పోటీల్లో గెలుపొందిన వారికి మంచి బ్యాగ్ అందిస్తామన్నారు. కలెక్టర్ విజయరామరాజు, శిల్పారామం సిఇఒ శ్యాం సుందర్రెడ్డి సహాయ సహకారాలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వివరాలకు 8886652938 నంబరు సంప్రదించాలని కోరారు.

ఉచితంగా బీమా సౌకర్యం

ప్రజాశక్తి - కడప

ప్రవాసీ భారతీయ దివస్ రోజు కువైట్ రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సుమారు 500 మందికి పైగా ఎపిఎన్ఆర్టిఎస్ ప్రవాసాంధ్ర భరోసా బీమా, ఎపి ప్రభుత్వం కల్పించిన 50 శాతం రాయితీ పురస్కరించుకుని, కుల మతాలకు అతీతంగా రూ.275 ప్రతి ఒక్కరికీ ఉచితంగా హవెల్లి ప్రాంతంలో ఉన్న షాబ్ పార్క్లో బుధవారం నమోదు చేశారని కువైట్ రెడ్డీస్ సంఘం అధ్యక్షులు నాయని మహేష్రెడ్డి, గౌరవ అధ్యక్షులు ముమ్మడి వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంచి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎపిఎన్ఆర్టిఎస్ అధ్యక్షులు మేడపాటి వెంకట్, డైరెక్టర్ ఇలియాస్, వైసిపి కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, రెడ్డీస్ అసోసియేషన్ సభ్యులు మన్నూరు చంద్ర శేఖర్రెడ్డి, రామచంద్రారెడ్డి, మధుసూదన్రెడ్డి, మహేశ్వరరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు సురేష్ కుమార్రెడ్డి, వాసుదేవరెడ్డి, చంద్రశేఖర్రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎపిఎన్ఆర్టిఎస్ ప్రతినిధులు


జిల్లాలో భారీగా తగ్గిన రబీ సాగు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రబీపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. విస్తారంగా పంటలు సాగు చేయాలని ఆశించారు. కరువు కమ్మేయడంతో పంటల సాగు ముందుకు సాగడంలేదు. వరుణుడిపై భారం వేసి అరకొరగా సాగు చేసిన పైర్లు కూడా బెట్టకు (ఎండుదశకు) గురై వాడుముఖం పడుతున్నాయి. కళ్లెదుటే ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. నేలతల్లిని నమ్ముకున్న మట్టి మనిషికి మనోవేదన తప్పడం లేదు. పాలకుల నుంచి భరోసా కూడా కరువైంది. వైయస్ఆర్ జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1,48,820 హెక్టార్ల కాగా 32,878 హెక్టార్లలో (22.09శాతం) పంటలు సాగు చేశారు. గత నవంబర్ నెలలో 132.1 మి.మీ.లకుగానూ 4.02 మి.మీ., డిసెంబర్ నెలలో 76.8 మి.మీ.లకుగానూ 11.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. సీజన్ ప్రారంభమై ఇప్పటికే రెండు నెలలు గడిచిపోయింది. సాధారణ సగటు వర్షపాతంలో కనీసం 10 శాతం కూడా కురవలేదు. జిల్లాలో చిన్న, మధ్య తరహా, పెద్ద జలాశయాలు 13 ఉన్నాయి. వీటి నిల్వ సామర్థ్యం 77.283 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 34.693 టీఎంసీల నీరుంది. ఆయకట్టుకు సేద్యపు జలాలు ఇవ్వడానికి అవసరమైన ప్రాంతాల్లో ప్రధాన, ఉప, పంట కాలువలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. కళ్లెదుటే జలనిధి ఉన్నా వినియోగించుకునే పరిస్థితి లేదు. చెరువుల్లోనూ జలకళ కనిపించడంలేదు. వరుణుడిని నమ్ముకుని వర్షాధారంగా పైర్లు సాగు చేయడానికి రైతులు మునుపటిలా ధైర్యం చేయలేకపోవడంతో విస్తీర్ణం బాగా తగ్గింది. వ్యవసాయ పనులతో తీరిక లేకుండా గడపాల్సిన రైతులు చాలాచోట్ల పుడమి పదునెక్కక, సాగునీరు లేక ఖాళీగా ఉండాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది.

శనగ రైతుల ఆశలు ఆవిరి..

నల్లరేగడి భూములు అధికంగా ఉన్న వైయస్ఆర్ జిల్లాలోని 32 మండలాల్లో ఈ సారి శనగ పంట 93,093 హెక్టార్లలో సాగవుతందని అంచనా. భూమిలో తేమ లేక చాలా ప్రాంతాల్లో విత్తనం వేయడానికి అవకాశం లేకుండాపోయింది. ఈ ఏడాది కేవలం 8,982 హెక్టార్లలో మాత్రమే వేశారు. అదే గతేడాది 33,455 హెక్టార్లలో వేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. మినుము సాగు 8,754 హెక్టార్లకుగానూ 472 హెక్టార్లలో సాగు చేశారు. భూమిలో తేమ తగినంత లేక మొక్కలు ఎదుగుదలతో వృద్ధి కనిపించడం లేదు. కనీసం 20 మి.మీ. వర్షం కురిసినా పైరు ఊపిరి పోసుకుంటుంది. ఎక్కడా కూడా వాన జాడలేక రైతుల ఆశలు ఆవిరయ్యాయి. మినుము ధరలు ఆశాజనకంగా ఉండడంతో విస్తారంగా సాగు చేశారు. జిల్లాలో వాస్తవంగా 9,166 హెక్టార్లలో సాగవుతుందని అధికారులు అంచనా వేయగా, 15,125 హెక్టార్లలో వేశారు. చినుకు జాడ లేకపోవడంతో పైరు బెట్టకు గురైంది. నీటి తడులు అందించడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మిగతా రకాల పైర్లు కూడా ఆశాజనకంగా సాగు చేయలేని దయనీయ దుస్థితి.



సాగులో ఉన్న మినుము, వేరుశనగ పంటలు

రబీ అయినా ఆదుకునేనా..

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులకు నష్టాలను మిగిల్చింది. ఖరీఫ్ కింద వేరుశనగ, పొద్దుతిరుగుడు, పత్తి తదితర పంటలు సాగు చేశారు. అప్పటి నుంచి వర్షాలు సకాలం రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్ నష్టాన్ని పూడ్చుకోవడానికి రబీ సాగుపైనా రైతులు ఆశలు పెట్టుకున్నారు. రబీ సాగులో ఎక్కువగా ఆహార ధాన్యాలను పండించేందుకు రైతులు మక్కువ చూపుతారు. అందులో భాగంగానే శెనగ, జొన్న, కొర్ర, మినుము వంటి పంటలను సాగు చేశారు. ప్రస్తుతం మినుము పంట విస్తారంగా సాగులో ఉంది. నీటి తడులు అందించడానికి రైతులు నానా కష్టాలు పడుతున్నారు. పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు రబీ పంటలపై ఆశ పెట్టుకున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

క్రీడలను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - వేంపల్లె

క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోందని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఆట స్థలంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను జడ్‌పిటిసి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ఎంపిడిఒ సంపతి దివిజ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని స్నేహభావంతో ఆడాలని కోరారు. అనంతరం కబడ్డీ, క్రికెట్ ఆటలను జడ్‌పిటిసి, ఎంపిటిసిలు కలిసి ఆడారు. జిల్లా స్థాయికి ఎంపిక కావాలని జడ్‌పిటిసి కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు భారతి, రహంతుల్లా ఖాన్, కటిక చంద్రశేఖర్, బ్రహ్మయ్య, అనసయ్య, రాజకుమార్, మఠం గోపాల్‌రెడ్డి, వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, బక్కన్నగారిపల్లె సర్పంచ్ మల్లయ్య, రామగంగిరెడ్డి, బండల షుకూర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చాపాడు : చాపాడులో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలను బుధవారం అన్నవరంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పోటీలు ముగిశాయని, ప్రస్తుతం మండలస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 15 క్రికెట్ టీంలు మండలస్థాయికి వచ్చాయన్నారు. వాలీబాల్, కోకో, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు పల్లవోలు-ఐదిపల్లి, చాపాడు-అయ్యవారిపల్లి, లక్ష్మీపేట-చియ్యపాడు టీంలు పోటీ పడ్డాయి. కార్యక్రమంలో సర్పంచ్ వీరయ్య, పిజికల్ డైరెక్టర్లు రాజసింహ, హసీనా, పంచాయతీ కార్యదర్శులు బాలలక్ష్మి, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలోని అన్ని సచివాలయ కేంద్రాల్లో బుధవారం క్రికెట్ పోటీలు ఎంపిడిఒ మహబూబ్ బీ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పిజికల్ సుమన్, రవిచంద్ర, రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో చర్చిస్తున్న తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

ఎక్కువ పరిహారం వచ్చేందుకు కృషి

ప్రజాశక్తి - వేంపల్లె

చాగలమర్రి-రాయచోటి నేషనల్ హై రోడ్డు నిర్మాణంలో భూములు, ఇంటి స్థలాలు కోల్పోయే రైతులు, స్థల యజమానులకు నష్టపరిహారం ఎక్కువ వచ్చేందుకు కృషి చేస్తామని తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ చాగలమర్రి నుండి రాయచోటి వరకు వేసే జాతీయ రహదారి నిర్మాణంలో 150 మంది దాదాపు 43 ఎకరాలు భూమి కోల్పుతున్నట్లు చెప్పారు. భూములు, స్థలాలు కోల్పోయేవారు సహకరించాలని కోరారు. వ్యవసాయ భూమి అయితే మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.6 లక్షలు పరిహారం ప్రభుత్వం ఇస్తుందన్నారు. మార్కెట్ విలువ ప్రకారం ధర నిర్ణయిస్తారని తెలిపారు. ఇంటి నిర్మాణం ఉంటే వాటి విలువ ప్రకారం కూడా పరిహారం ఇస్తారని తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శివలక్ష్మి, మండల సర్వేయర్ శివారెడ్డి, గ్రామ సచివాలయం సర్వేయర్లు శివశంకర్‌రెడ్డి, బ్రహ్మం, విఆర్‌ఒ రవీంద్రారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు రైతులతో గ్రామసభలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వేంపల్లి నుండి చాగలమర్రి వరకు నిర్మిస్తున్న రోడ్డు విస్తరణకు రైతులతో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని హనుమన గుత్తి, పొట్లదుర్తి, పెదనపాడు, కోడూరు, ఎర్రగుంట్ల గ్రామాల రైతులకు రోడ్డు విస్తరణలో భాగంగా నష్ట పరిహార విషయమై గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామసభలో రెవెన్యూ డివిజనల్ అధికారి నాగరాజు పాల్గొంటారని తెలిపారు. హనుమనగుత్తి, పొట్లదుర్తి, పెదనపాడు, కోడూరు గ్రామాలకు సంబంధించి గ్రామ పంచాయితీ కార్యాలయాల్లోనే గ్రామసభ నిర్వహిస్తామని తెలిపారు. ఎర్రగుంట్లకు సంబంధించి ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామసభల్లో రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

ఉరి వేసుకుని యువకుడి మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని తోట్లపల్లి పంచాయతీ పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీనాథ్ (20) అనే యువకుడు బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. ఆడుదాం ఆంధ్ర క్రికెట్ మ్యాచ్ ఆడి ఇంటికి వెళ్లిన శ్రీనాథ్.. పనులకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగానే తలుపులు వేసి ఉన్నాయి. ఎంత సేపు పిలిచిన పలకక పోవడంతో బలవంతంగా తలుపులు తెరిచి చూస్తే అప్పటికే శ్రీనాథ్ మృతి చెంది ఉన్నాడు. కారణాలు తెలియాల్సి ఉంది.



శ్రీనాథ్ (ఫైల్‌ఫొటో)

విద్యుదాఘాతంతో మరొకరు..

ముద్దనూరు : పొలంలో ప్రమాదవశాత్తు విద్యు మోటారు షాక్ తగిలి చెప్పలి సిద్ధయ్య (40) మృతి చెందాడు. ఎఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన సిద్ధయ్య భారతి సిమెంట్స్ కర్మాగారంలో కూలి పనులు చేసుకుంటూ ఎర్రగుంట్లలో నివాసం ఉంటున్నారు. కోనాపురం గ్రామంలో ఉండే పొలాలను సాగు చేస్తున్నారు. బుధవారం పొలానికి నీరు పెడుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. మృతుడి తండ్రి చెంద్రాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిద్ధయ్యకు భార్య, పిల్లలు ఉన్నారు.



మృతుడు చెప్పలి సిద్ధయ్య

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని బిదనంచర్లలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. అందిన సమాచార మేరకు బుధవారం దాడి చేసి, మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్ఐసిలో వేతన సవరణ తక్షణం చేపట్టాలి



నిరసనలో పాల్గొన్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎల్ఐసి యాజమాన్యం సంస్థలో వేతన సవరణ తక్షణం చేపట్టాలని యూనియన్ అధ్యక్షులు వై.కళ్యాణ్ పేర్కొన్నారు. సిబ్బంది సంఘాల జాయింట్ ఫ్రంట్ నాయకులు వెంకటరామిరెడ్డి, టి.ఆది నారాయణ, యం.నర్సింహులు ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ డిసెంబర్‌లో చర్చలకు ఉద్యోగ సంఘాలను ఆహ్వానించి, వాటిని అర్ధాంతరంగా వాయిదా వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగంలో వేతన సంవత్సరం చర్చలు కొలిక్కి వచ్చాయని, ఎల్ఐసిలో వేతన సవరణ గడువు ముగిసి 18 నెలలైనా, ఇంకా చర్చలే ప్రారంభం కాకపోవడం అన్యాయం అన్నారు. ప్రైవేటు కంపెనీల నుంచి అనైతిక పోటీ తర్వాత కూడా బీమా రంగంలో ఎల్ఐసిని ప్రపంచంలోనే నాలుగవ బలమైన బీమా సంస్థగా నిలబెట్టిన ఘనత సిబ్బందిదేనన్నారు. నూతన పెన్షన్ స్కీం వర్తించే సిబ్బంది విషయంలో 14శాతం యాజమాన్య పిఎఫ్ వాటా ఇస్తూ తక్షణం నిర్ణయం తీసుకోవాలన్నారు. అన్ని కేడర్లలో ఎల్ఐసిలో అవసరమైన మేర నూతన నియామకాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. సిబ్బందికి సంబంధించిన అంశాల్లో యాజమాన్య ఏకపక్ష వైఖరిని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సమ్మె కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుధాకర్‌రెడ్డి, నర్సింహ, నిహారిక, నర్సింహులు, నాగరాజు, నిర్మల, మోహన్‌రెడ్డి, దావూద్ బాషా, బ్రహ్మయ్య, నర్సింహం, జనార్ధన, నాగశేఖర రావు, కిషోర్, సుబ్బరాయుడు, రాధయ్య, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఒపిఎస్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నంద్యాల ప్లెయిన్ బ్రాంచ్ వైస్ చైర్మన్ టి.ఓబులేసు అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ పిలుపు మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. న్యూ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. రైల్వే ఉద్యోగులు వారి శేష జీవితానికి, కుటుంబాలకు భరోసా కల్పించాలన్నారు. దేశం కరోనాను ఎదుర్కొని విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన రైల్వే ఉద్యోగులకు వృద్ధాప్యంలో భద్రత కల్పించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నంద్యాల ప్లెయిన్ బ్రాంచ్ వైస్ చైర్మన్ ఇ.వెంకటనారాయణ, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలు సురేష్‌బాబు, దస్తగిరిరెడ్డి, సభ్యులు మహమ్మద్, కిషోర్‌కుమార్, దాదాపీర్, జగన్, ఆశారాం, బబ్లూ, విక్రమ్, సిద్దార్థ్, పవన్, నాగేంద్ర, చైతన్య పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న రైల్వే సిబ్బంది

'అవినీతి నిరూపిస్తాం.. రాజీనామాకు సిద్ధమా..!'



మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

గిడ్డింగివారిపల్లె చెరువులో అవినీతి, అక్రమాలు జరిగినట్లు తాము నిరూపిస్తామని, రాజీనామా చేసేందుకు జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి సిద్ధమా అని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, డివి సుబ్బారెడ్డి, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్ సవాల్ విసిరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గిడ్డింగివారిపల్లె చెరువు నిర్మాణానికి బంక మట్టి క్వారీ ఇచ్చింది నల్లచెరువుపల్లె వద్ద కాగా.. అలవలపాడు చెరువు నుంచి బంక మట్టిని తరలించారన్నారు. అధికారం ఉందనే కారణంతో రైతులకు ఉపయోగపడే నీటిని వంకల పాల్జేసి బంక మట్టిని తవ్వడం అక్రమం కాదా అని ప్రశ్నించారు. అలవలపాడు లీడ్ దగ్గర ఉందని, అక్కడి నుంచి రవాణా చేయడం అన్యాయం కాదా అన్నారు. గ్రావెల్ క్వారీ తగేండుపల్లె సమీపంలోని కొండ ప్రాంతం నుంచి అనుమతి ఇస్తే రిజర్వు ఫారెస్టు ప్రాంతంలోకి వెళ్లి గ్రావెల్‌ను తవ్వకాలు చేయడం అక్రమం అనిపించలేదా అన్నారు. కొండాపురం రీచ్ నుంచి ఇసుకను రవాణా చేయాలని అనుమతి ఇస్తే వేంపల్లె పాపాఘ్ని నది నుంచి ఇసుకను తరలించడం అవినీతి కాదా అని వారు పేర్కొన్నారు. వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు విస్తరణలో ఏలాంటి అవినీతి జరగలేదని గొప్పలు చెప్పడం శోచనీయమన్నారు. బాధితుల ఇంటి వద్ద ఉన్న మట్టిని తరలించడానికి రూ.1.30 కోట్ల నిధులు టెండర్ రూపంలో మంజూరైతే ఇంటి యజమానులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా స్వాహా చేయలేదా అన్నారు. అవినీతిపై చర్చించడానికి ఎప్పుడైనా, ఎక్కడైనా టిడిపి సిద్ధంగా ఉందన్నారు. విలేకరుల సమావేశంలో రామాంజనేయరెడ్డి(చంటి), మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వల్లి, టిడిపి కడప పార్లమెంటు మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పూల అల్లాబకష్, షేక్ మొహమ్మద్, ఇలియాస్, జబీబుల్లా, మడక శ్రీనివాసులు, డక్కా రమేష్, వేమకుమార్, టైర్ల మాబు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విభిన్నప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని, అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం విడుదల చేసిన బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. పదిరోజుల క్రితం ట్రైసైకిళ్లను పంపిణీ చేసి మిగిలిన వారికి కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఇందుకు సజీవ సాక్షాలు ఎన్నో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్‌ఛైర్మెన్ ఆయిల్‌మిల్ ఖాజా, వైసిపి నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.



ట్రైసైకిల్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రవీణ్‌కుమార్ రెడ్డి

టిడిపి ప్రభుత్వంలోనే ప్రజలకు మేలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చంద్రబాబు ప్రభుత్వంలోనే పేదలకు మేలు జరుగుతుందని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మునిసిపాలిటీ కొత్త మార్కెట్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ఆయన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి మరోసారి అధికారంలోకి వస్తే జరిగే నష్టాలను ఇంటింటికి వెళ్లి వివరించి కరపత్రాలను అందజేశారు. టిడిపి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, టిఎన్టియుసి పట్టణ అధ్యక్షుడు తమ్మిశెట్టి శ్రీనివాసులు, పట్టణ బీసీ సెల్ అధ్య క్షులు తమ్మిశెట్టి సురేంద్ర, బండారు గురప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా మురళి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి ఆదేశాల మేరకు తొండూరు మండల ఎస్సి సెల్ అధ్యక్షులుగా మిద్దె మురళిని నియమించారు. ఈ సందర్భంగా బుధవారం మురళి మాట్లాడుతూ తనకు సహకరించిన తొండూరు మండల పరిశీలకులు మారెడ్డి జయభరత్‌రెడ్డికి, తొండూరు మండల అధ్యక్షులు శివమోహన్‌రెడ్డి కి, తొండూరు మండల నాయకులకు, మడూరు టిడిపి నాయకులు ఆదర్శ్‌కు, టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు మల్లేష్‌కు, ఆర్గనైజేషన్ సెక్రెటరీ శివాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో టిడిపి గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నాయకులు పాల్గొన్నారు.

అవసరమైతే ప్రత్యేక చికిత్సలు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - మైదుకూరు

అవసరమైతే రోగులకు ప్రత్యేక చికిత్సలు అందించేందుకు కృషి చేస్తామని డిఎంహెచ్‌ఒ కె.నాగరాజు తెలిపారు. మైదుకూరు లిగోరి పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రజలు శిబిరానికి వచ్చినప్పుడు వారికి వైద్యపరంగా ఏమేమి అవసరమో తెలుసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ మల్లేష్, వైద్యాధికారి డాక్టర్ సుమధుర, జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ హుస్సేన్ బాషా, వైద్యురాలు డాక్టర్ సుధా, ఆరోగ్య సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

చాపాడు ఎస్‌ఐగా ఆర్‌వి కొండారెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ఎస్‌ఐగా పనిచేస్తున్న మైనుద్దీన్ ముద్దనూరు పోలీస్ స్టేషన్‌కు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కడప విఆర్‌లో ఉన్న ఆర్.వి. కొండారెడ్డిని చాపాడుకు నియమించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో 25 మంది ఎస్‌ఐలను పోలీసు అధికారులు బదిలీ చేశారు. ఎస్‌ఐ మైనుద్దీన్ ఆరు నెలల క్రితం చాపాడుకు వచ్చారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రూరల్ పరిధిలోని శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమానికి ఆర్‌కె హెల్పింగ్ హాండ్స్ కువైట్ సహకారంతో మీకోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.20వేలు విలువచేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ శోభారాణి, మైలవరం ఎంఇఒ చిట్టిబాబు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి ఆర్‌కె హెల్పింగ్ హాండ్స్ కువైట్ వారు కొంతమంది వ్యక్తులతో సమూహంగా ఏర్పడి జీవనోపాధి కోసం కువైట్ తదితర విదేశాలకు వెళ్లి జీవనం సాగిస్తూ, వచ్చిన ఆదాయంలో కొంత భాగం రాష్ట్రంలోని 11 ఆశ్రమాలకు, అందులో కడప జిల్లాలో 5 ఆశ్రమాలకు సహాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ కడప జిల్లా అధ్యక్షులు సి.వి.సురేంద్ర, ఆదరణ సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, మీకోసం సేవా సంస్థ విష్ణువర్ధన్, కోనేటి ఓబుల్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు సుబ్బారాయుడు పాల్గొన్నారు.



తహశీల్దార్ యామినికి వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

జిఒ 512 రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - చాపాడు

ప్రజలకు, రైతులకు, న్యాయ విభాగంలో నష్టం చేకూర్చే పద్ధతిలో తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023 చట్టాన్ని రద్దు చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ పేర్కొన్నారు. బుధవారం చాపాడు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఈ చట్టానికి వ్యతిరేకంగా మండల రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ యామినికి వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో రమణతోపాటు రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు, చాపాడు మండల రైతు నాయకులు, రామకృష్ణ, నాగేశ్వర్‌రెడ్డి, వెంక టేష్, భాస్కర్, పుష్పరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు బ్రహ్మ య్య, న్యాయ విద్యార్థి విభాగం నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు వాలంటీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపిడిఒ సంపతి దివిజ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇడుపులపాయ, అయ్యవారిపల్లె గ్రామంలో ఖాళీగా ఉన్న వాలింటీర్లు పోస్టులకు 11,12 తేదీల్లో అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చు అన్నారు. వీరికి ఈనెల 14 నుండి 17 వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై చర్చ

ప్రజాశక్తి - మైదుకూరు

త్వరలో జరిగే ఎన్నికలకు సంబంధించి రూట్ మ్యాప్, పోలింగ్ కేంద్రాల్లో వసతులపై బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌషర్ భాను చర్చించారు. రెవెన్యూ, పోలీస్ శాఖలతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో తహశీల్దార్లు, సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్ జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు విఆర్ జూనియర్ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శీలం వెంకటరాముడు, వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ తిరుమలేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న కరస్పాండెంట్ వెంకటరాముడు